సాక్షి
అనకాపల్లి
సోమవారం । 7 । ఏప్రిల్ । 2025



అలరించిన కోలాటం

మధురవాడ: శిల్పారామం (జాతర)లో ఆదివారం ప్రదర్శించిన కోలాటం, శాస్త్రీయ నృత్య ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకుంది.

ఉష్ణోగ్రతలు

ఆదివారం

	గరిష్ఠం/కనిష్ఠం
అనకాపల్లి	36.3/21.0
చోడవరం	34.0/24.0



పుస్తకావిష్కరణ

సీతంపేట: డాక్టర్ నండూరి రామకృష్ణ రచించిన సామాజిక నిత్య హితోక్తులు వచన సంపుటిని సీపీ శంఖబ్రత బాగ్చీ ఆవిష్కరించారు.

న్యూస్‌రీల్

గింజ గింజపై రామనామం



శ్రీరామనామంతో కూడిన బియ్యం గింజలు



బియ్యపు గింజలపై శ్రీరామనామాలు రాస్తున్న యశోద

మునగపాక: పది కాదు.. వంద కాదు ఏకంగా 6666 బియ్యపు గింజలపై శ్రీరామనామాలు రాసి అందరి మన్ననలు అందుకున్న భక్తురాలు యశోద. మండలంలోని నాగులాపల్లికి చెందిన కర్రి వాసు, యశోద దంపతులు శ్రీరాముని భక్తులు. ఈ ఏడాది సీతారాముల కళ్యాణానికి ఆమె 6666 బియ్యపు గింజలపై శ్రీరామనామాలు రాసి అర్చకులకు అందజేశారు. ఈ బియ్యపు గింజలను కళ్యాణంలో పురోహితులు వినియోగించారు. గత కొన్నేళ్లుగా ఇదే రీతిలో బియ్యపు గింజలపై శ్రీరామనామాలు రాసి తన భక్తిని చాటు కుంటున్నారు.

రాష్ట్ర తైక్వాండో పోటీల్లో ఏడుగురికి పతకాలు

ఎస్.రాయవరం: రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో మండలానికి చెందిన ఏడుగురు విద్యార్థులు పతకాలు సాధించినట్టు తైక్వాండో కోచ్ చిరంజీవి తెలిపారు. అనకాపల్లి జిల్లా నుంచి 33 మంది విద్యార్థులు పాల్గొనగా మండలానికి చెందిన ఏడుగురికి పలు రకాల మెడల్స్ వచ్చాయి. ఈ నెల 5న గుంటూరు జిల్లా తెనాలిలో జరిగిన 4వ క్యాడెట్, జూనియర్ తైక్వాండో టోర్నమెంట్–2025లో తిమ్మాపురానికి చెందిన నలుగురు విద్యార్థులు బంగారు, కాంస్య, రజిత పతకాలు గెలుపొందినట్టు చెప్పారు. అసోసియేషన్ కార్యదర్శి రెడ్డి రామ్‌చరణ్, అధ్యక్షుడు కొండలరావు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

అది ముమ్మాటికీ హత్యే..

- బ్యూలను చంపిన ప్రేమోన్మాదిని అరెస్టు చేయాలి
- ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి వరలక్ష్మి డిమాండ్



బ్యూల కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి వరలక్ష్మి

కశింకోట: నరసింగబిల్లిలో విద్యార్థిని పిల్లిబోయిన బ్యూల (15) మృతి సంఘటనకు కారణమైన ప్రేమోన్మాదిని సత్వరమే అరెస్టు చేసి చట్ట ప్రకారం కఠినంగా శిక్షించాలని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి డి.డి.వరలక్ష్మి డిమాండ్ చేశారు. బాలిక కుటుంబాన్ని ఆదివారం పరామర్శించి సంఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. బ్యూలను ఇంటి పక్క అద్దెకు ఉన్న వ్యక్తి కిరాతకంగా హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించినట్టు సంఘటన జరిగిన తీరును బట్టి స్పష్టమవుతోందని ఆరోపించారు. హోం మంత్రి సొంత జిల్లాలోనే ఇటువంటి సంఘటనలు చోటు చేసుకోవడం శోచనీయమన్నారు. మహిళల రక్షణ కోసం చట్టాలు ఎన్ని ఉన్నా వాటిని అమలు చేయడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని, దీంతో ఇటువంటి సంఘటనలు జరుగుతున్నాయని విమర్శించారు.

సహస్ర ఘటాభిషేకంలో శ్రీవైష్ణవస్వాములకు ఆహ్వానం

సింహాచలం: ఈ నెల 30న జరిగే శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి చందనోత్సవాన్ని పురస్కరించుకుని ఆ రోజు రాత్రి నిర్వహించే సహస్ర ఘటాభిషేకంలో పాల్గొనేందుకు శ్రీవైష్ణవ స్వాముల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సింహాచలం దేవస్థానం ఇన్‌చార్జి ఈవో కె.సుబ్బారావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులు www.simhachalamdevasthanam.net వెబ్‌సైట్ ద్వారా లేదా, endow& eosvlnsd@gov.in ఈమెయిల్ ద్వారా పంపించవచ్చన్నారు. లేకుంటే దేవస్థానం కార్యాలయ పనివేళల్లో నేరుగా అందించవచ్చన్నారు. దరఖాస్తులను ఈ నెల 15లోపు చేరేలా పోస్టల్(ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, ఎస్‌వీఎల్‌ఎన్‌ఎస్ దేవస్థానం, సింహాచలం, విశాఖపట్నం–530028) లేదా దేవస్థానం వాట్సాప్ నెం.9398734605లో ద్వారా కూడా పంపించవచ్చని తెలిపారు. ముందుగా వచ్చిన 300 దరఖాస్తులను మాత్రమే పరిగణలోకి తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు.

కమనీయం.. రమణీయం


కనుల పండువగా సీతారాముల కల్యాణం



యలమంచిలి కొత్తపేట రామాలయంలో కల్యాణోత్సవం తిలకిస్తున్న భక్తులు

సిగ్గులొలుకుతూ సీతమ్మ.. మందహాసంతో రామయ్య.. వారి వివాహ మహోత్సవం జగతికంతా వేడుక.. భక్తులకు కనుల పండువ.. అందుకే ఊరూరా జనమంతా పెళ్లి పెద్దలై సీతారాముల కల్యాణాన్ని జరిపించారు.. ప్రతి గ్రామంలో రామాలయాల్లో, బహిరంగ వేదికలపై ఈ ఉత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. చూచు వారలకు చూడ ముచ్చటట.. పుణ్య పురుషులకు ధన్యభాగ్యమట.. అని పాడుకుంటూ అమ్మవారికి అయ్యవారికి పెళ్లి జరిపించారు. ప్రముఖ పుణ్యక్షేత్రం ఉపమాక వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉన్న రామాలయంలో స్వామివారి కల్యాణాన్ని అర్చక స్వాములు ప్రసాదాచార్యులు, శేషాచార్యులు ఘనంగా నిర్వహించారు. వేంపాడు రామాలయంలో ఈ వేడుకను ఘనంగా జరిపారు. మరో భద్రాచలంగా పేరు గాంచిన అరబుపాలెంలో సీతారాముల కళ్యాణాన్ని వేద పండితులు నాని, భార్గవాచార్యులు శాస్త్రోక్తంగా జరిపారు. జీలకర్ర, బెల్లం, మంగళసూత్రధారణ, తలంబ్రాలు వంటి తంతులను నిర్వహించారు. కె.కోటపాడు మండలం చిరికివానిపాలెం, బుచ్చెయ్యపేట మండలం పొట్టిదొరపాలెంలో రకరకాల పిండివంటలతో సీతమ్మకు సారె సమర్పించారు. ఇలా.. జిల్లాలోని ప్రతి పల్లె రామనామంతో ప్రతిధ్వనించింది. వివాహ వేడుక నిర్వహించి మురిసిపోయింది. కల్యాణ కాంతులతో వెలిగిపోతున్న సీతారాములను చూసి పరవశించింది.

\- సాక్షి న్యూస్ నెట్‌వర్క్



ఉపమాక వెంకన్న సన్నిధిలో సీతారాముల కల్యాణంలో మంగళసూత్ర ధారణ ఘట్టం



నక్కపల్లి మెరకవీధి రామాలయంలో సీతారాముల కల్యాణం



పాయకరావుపేట రామాలయంలో చిన్నారుల గీతాలాపన



బుచ్చెయ్యపేట మండలం పొట్టిదొరపాలెంలో భక్తులు సమర్పించిన సీతమ్మ సారె

ఏయూలో గాడితప్పిన బిజినెస్

- స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్‌పై ప్రభుత్వ నిర్లక్ష్యం
- రెగ్యులర్ ఫ్యాకల్టీలు లేక చదువులు తిరోగమనం
- రిటైర్ అయిన ఆచార్యుడికి డైరెక్టర్ పగ్గాలు
- ఆరోపణలు ఎదుర్కొంటున్న వారికి అందలం
- వీసీ నిర్ణయాలపై విస్మయం



ఏయూలోని స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్

విశాఖ విద్య: ఆంధ్ర యూనివర్సిటీలోని 'స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్' గాడి తప్పుతోంది. కూటమి ప్రభుత్వం ప్రైవేటు యూనివర్సిటీలకు మేలు చేసేలా తీసుకుంటున్న నిర్ణయాలతో ఏయూలోని స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్ నిర్వహణపై తీవ్ర ప్రభావం చూపుతోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆంధ్ర యూనివర్సిటీకి ఇచ్చిన ప్రాధాన్యతతో అప్పటి వీసీ ప్రసాద్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని 2021–22 విద్యా సంవత్సరంలో దీన్ని ప్రారంభించారు. మార్కెటింగ్, ఫైనాన్స్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, హాస్పటాలిటీ మేనేజ్‌మెంట్ స్పెషలైజేషన్‌తో బీబీఏతో పాటు ఎంబీఏ కూడా పూర్తి చేసుకునేలా ఇంటిగ్రేటెడ్ కోర్సులను అందుబాటులోకి తీసుకురావటంతో విద్యార్థుల నుంచి మంచి ఆదరణ లభించింది.

చదువులు తిరోగమనం

సెల్ఫ్ సపోర్ట్ ప్రోగ్రామ్ కింద రూసా నిధులతో 'స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్'ను ఏయూలో ప్రారంభించారు. తరగతుల నిర్వహణలో భాగంగా కాంట్రాక్టు పద్ధతిన సీనియర్ ఆచార్యులు, అవసరమైన మేరకు అతిథి అధ్యాపకులను నియమించారు. ప్రభుత్వ ఆమోదంతో రెగ్యులర్ ప్రాతిపదికన పోస్టుల భర్తీకి ప్రయత్నాలు చేశారు. ఈలోగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటం, ప్రసాద్ రెడ్డిని వీసీ పదవి నుంచి తప్పించటం జరిగిపోయాయి. కానీ, రెగ్యులర్ ఫ్యాకల్టీ నియామకాలపై ప్రస్తుత ప్రభుత్వం ఏమాత్రం దృష్టి సారించడం లేదు. అంతా అతిథి అధ్యాపకులే కావటంతో ఇక్కడ చదువులు సవ్యంగా సాగటం లేదు. ఈ కారణంగానే స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్ చదువుల స్టాండర్డ్ తగ్గినట్లు నివేదికలు చెబుతున్నాయి. బాధ్యతాయుతంగా పాఠాలు చెప్పేవారు లేకపోతే, పరిస్థితి ఇలానే ఉంటుందని ఇక్కడి ఆచార్యులు సైతం అంగీకరిస్తున్నారు.

ఉద్యోగ విరమణ చేసిన ఆచార్యుడికి కీలక బాధ్యత

ఉద్యోగ విరమణ చేసిన వారికి కీలక బాధ్యతలు అప్పగించకూడదనేది యూజీసీ నిబంధన. తాము అధికారంలోకి వస్తే, రిటైర్ అయిన వారందరినీ యూనివర్సిటీ నుంచి సాగనంపుతామని కూటమి పెద్దలు ఊకదంపుడు ఉపన్యాసాలు కూడా ఇచ్చారు. కానీ ఏయూకు బ్రాండ్ అంబాసిడర్‌గా నిలుస్తున్న స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్ పగ్గాలు రిటైర్ అయిన ఆచార్యుడికి అప్పగించడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. ఇన్‌చార్జ్ వీసీ శశిభూషణ రావు హయాంలో కూటమి పెద్దల సిఫార్సుతోనే నియామకం జరిగినట్లు ప్రచారం సాగింది. ప్రస్తుత వీసీ ఆచార్య రాజశేఖర్ హయాంలోనూ అదే వ్యక్తికి డైరెక్టర్‌గా కొనసాగింపు ఉత్తర్వులు ఇవ్వడంపై వర్సిటీ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఉద్యోగ విరమణ చేసిన ఓ ఆచార్యుడు సైతం ఇక్కడ ఎటువంటి అధికారిక ఉత్తర్వులు లేకుండానే కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. ప్రసాద్ రెడ్డిపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్న కూటమి ప్రభుత్వం, ఆయన హయాంలో ఏర్పాటు చేసిన స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్‌ను నిర్వీర్యం చేయనుందా..? అనే అనుమానాలు సైతం ఆచార్యులు వ్యక్తం చేస్తున్నారు.

విదేశీ విద్యార్థులతో క్రేజ్

స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్ 'ఆంధ్ర యూనివర్సిటీకి బ్రాండ్ అంబాసిడర్'గా మారింది. ఇంటిగ్రేటెడ్ మేనేజ్‌మెంట్ కోర్సుల్లో డిగ్రీ, పీజీ చేసే అవకాశం ఉండటంతో ఇక్కడ చదివేందుకు విదేశీ విద్యార్థులు మొగ్గుచూపుతున్నారు. విదేశీ ఎంబసీ ఆమోదంతో ఇంటర్నేషనల్ వ్యవహారాలు చూసే విభాగం ద్వారా ఏయూ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్‌లో చేరే వారిలో 40 శాతం మంది విద్యార్థులు ఆఫ్రికా దేశాలకు చెందిన వారు ఉండటం గమనార్హం. అన్ని కోర్సులు కలుపుకొని 350 మందితో ప్రారంభమైన కళాశాలలో విద్యార్థుల సంఖ్య ఈ మూడేళ్ల కాలంలో 586కు చేరింది. చెన్నైకి చెందిన లాజిస్టిక్స్ అండ్ సప్లయ్ మేనేజ్‌మెంట్‌తో ఎంవోయూ చేసుకోవడంతో ఇక్కడ కోర్సులు అభ్యసించే విద్యార్థులకు క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ లభిస్తున్నాయి.

రైవాడ జలాశయంలో భారీ చేపలు

- వరద నీరు వచ్చి చేరడంతో ఇబ్బడి ముబ్బడిగా మత్స్యాలు
- ఎగబడి కొనుగోలు చేసిన చేపల ప్రియులు



రైవాడ జలాశయంలో మత్స్యకారుడి వలకు చిక్కిన 8 కేజీల చేప

దేవరాపల్లి: రైవాడ జలాశయంలో మత్స్యకారుల వలలకు భారీ చేపలు చిక్కుతున్నాయి. రెండు, మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరద నీరు వచ్చి చేరుతుండటంతో భారీగా చేపలు దొరుకుతున్నాయి. సాధారణంగా ఇక్కడ ఐదు కేజీల లోపు బరువున్న చేపలు మాత్రమే లభిస్తాయి. ప్రస్తుతం వరద నీరు వచ్చి చేరడంతో సుమారు 10 కేజీల బరువున్న బొచ్చు, శీలావతి తదితర రకాల చేపలు వలకు చిక్కుతున్నాయి. కేజీ ధర రూ.200 పలికినా చేపల ప్రియులు పోటీ పడి మరీ కొనుగోలు చేస్తున్నారు. రైవాడ జలాశయంలోని చేపలు రుచికరంగా, తాజాగా ఉండటంతో డిమాండ్ ఎక్కువ.

నిండుకుండలా రైవాడ జలాశయం

రైవాడ జలాశయం నీటిమట్టం క్రమేపీ పెరుగుతోంది. రెండు, మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు జలాశయంలోకి వరద నీరు వచ్చి చేరుతోంది. జలాశయం గరిష్ట నీటి మట్టం 114 మీటర్లు కాగా ప్రస్తుతం 111.70 మీటర్లకు చేరుకుంది. జలాశయంలోకి సుమారు 200 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతోంది. జలాశయంలో సమృద్ధిగా నీటి నిల్వలు ఉండటంతో రబీలో సాగు నీటికి ఢోకా ఉండబోదని స్థానిక రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జలాశయానికి ఎగువ భాగంలో వర్షాలు కురిస్తే జలాశయంలోకి మరింత వరద నీరు వచ్చే అవకాశం ఉందని జలాశయ డీఈఈ జి.సత్యం నాయుడు తెలిపారు.


రోడ్లు నిర్మించండి.. డోలీ మోతలు తప్పించండి

సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వెంకన్న డిమాండ్

మాడుగుల: గిరి గ్రామాల్లో రోడ్లు నిర్మిస్తామని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గిరిజనులకు ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి.వెంకన్న డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాడుగులలో సాక్షితో మాట్లాడుతూ.. మాడుగుల నియోజకవర్గంలో గిరి గ్రామాలకు రహదారులు నిర్మించి, డోలీ మోతల నుంచి విముక్తి కలిగించాలన్నారు. మాడుగుల మండలం శంకరం పంచాయతీలో తాడివలస, గొప్పూరు, రాయిపాలెం, రాజంపేట గ్రామాల్లో 50 శాతం పనులు పూర్తయ్యాయని, అసంపూర్తిగా ఉన్న రోడ్ల నిర్మాణంతో పాటు కొత్తవలస, తాడివలస గ్రామాల వద్ద ఉరక గెడ్డపై వంతెనల నిర్మాణం చేపట్టాలని గిరిజనులు కోరుతున్నారన్నారు. 108 వాహనాలు ఈ గ్రామాలకు రాకపోవడంతో గిరిజన మహిళలు ప్రసవ సమయంలో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు పూర్తవుతున్నా గిరిజన గ్రామాల్లో రోడ్లు పూర్తి చేయకపోవడం విచారకరమన్నారు. గిరి గ్రామాలకు రోడ్లు ఏర్పాటు చేస్తానని ఇచ్చిన హామీని ఉప ముఖ్య మంత్రి పవన్ కల్యాణ్ నిలబెట్టుకోలేదన్నారు. కోనాం పంచాయతీలో రెళ్లపాలెం, చెరుగుబిల్లి, జాజులపాలెం, బందవీధి, దేవరాపల్లి మండలం చింతలపూడి పంచాయతీలో బోడిగరువు, నేరెళ్లపూడి గ్రామాలకు తారు రోడ్డు నిర్మాణం చేపట్టాలన్నారు. ఈ గ్రామాలకు గత ప్రభుత్వం రూ.2 కోట్ల డెవలప్‌మెంట్ నిధులు కేటాయించడంతో సగం పనులు జరిగాయన్నారు. మిగిలి ఉన్న పనులు పూర్తి చేయాలని కోరారు. గరిసింగి పంచాయతీ కించుమండకు నేటికీ ఎటువంటి రోడ్డు లేదన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అరకు పర్యటనకు వస్తున్న సందర్భంగా గిరి గ్రామాలకు రోడ్ల నిర్మాణపై నిర్ణయం తీసుకొని ఆదుకోవాలని డిమాండ్ చేశారు

13 రైల్వే స్టేషన్లలో 28 లిఫ్టులు

- టెండర్లు ఆహ్వానించిన వాల్తేర్ డివిజన్
- అమృత్ భారత్‌తో 15 స్టేషన్లకు కొత్త శోభ



ఇలా మారనున్న దువ్వాడ రైల్వే స్టేషన్

సాక్షి, విశాఖపట్నం: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అమృత్ భారత్ పథకం ద్వారా వాల్తేరు రైల్వే డివిజన్ పరిధిలో 15 రైల్వేస్టేషన్లు కొత్త రూపు సంతరించుకుంటున్నాయి. సౌకర్యాల కల్పనలో భాగంగా స్టేషన్లలో లిఫ్టులు ఏర్పాటు చేసేందుకు తాజాగా టెండర్లు ఆహ్వానించారు. 13 స్టేషన్ల పరిధిలో రూ.13.67 కోట్లతో 28 లిఫ్టులు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. వాల్తేరు డివిజన్ పరిధిలో మొత్తం 15 రైల్వే స్టేషన్లను అమృత్ భారత్ పరిధిలోకి తీసుకొచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లో సింహాచలం, దువ్వాడ, అరకు, బొబ్బిలి, చీపురుపల్లి, కొత్తవలస, నౌపడ, శ్రీకాకుళం, పార్వతీపురం, విజయనగరం స్టేషన్లు, ఛత్తీస్‌గఢ్ పరిధిలో జగదల్‌పూర్, ఒడిశా పరిధిలో దమన్‌జోడీ, జైపూర్, కోరాపుట్, పర్లాఖిముండి రైల్వే స్టేషన్లలో అభివృద్ధి పనులు మొదలయ్యాయి. ఈ పథకంలో భాగంగా రైల్వే స్టేషన్లలో కొత్త భవనాలు నిర్మించడంతో పాటు ఎస్కలేటర్లు, లిఫ్టులు అందుబాటులోకి రానున్నాయి. ఆధునిక ఆహార శాలలు, వాణిజ్య సముదాయాలు నిర్మించనున్నారు. అలాగే అత్యాధునిక సౌకర్యాలతో మరుగుదొడ్లు, సామగ్రి భద్రపరుచు కునే గదులు, తాగు నీరు, ఏటీఎం సౌకర్యాలు కల్పించనున్నారు. వసతి గదులు, ప్లాట్‌ఫాంలపై డిజిటల్ డిస్‌ప్లే బోర్డులు అందుబాటులోకి రానున్నాయి. రైల్వేస్టేషన్ మొత్తం సీసీటీవీ పరిధిలో నిఘా ఉంచడంతో పాటు పచ్చదనం, పరిశుభ్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వనున్నారు.

13 స్టేషన్లలో లిఫ్టుల ఏర్పాటుకు టెండర్లు

తాజాగా 13 స్టేషన్లలో లిఫ్టులు ఏర్పాటుకు రెండు ప్యాకేజీల కింద రూ.13.67 కోట్లతో వాల్తేరు డివిజన్ టెండర్లు ఆహ్వానించింది. ఒక లిఫ్ట్ 13 మంది ప్రయాణికులకు సరిపడేలా, మరో లిఫ్ట్ 20 మందికి సరిపడేలా.. మొత్తం 28 లిఫ్టులు ఏర్పాటు చేయనున్నారు. చిన్న స్టేషన్లలో ఒకే లిఫ్ట్ ఉండాలని నిబంధన విధించారు.

అర్ధరాత్రి వ్యవసాయ విద్యుత్

- వేంపాడు సబ్‌స్టేషన్ పరిధిలో ఇబ్బంది పడుతున్న రైతులు



వేంపాడు విద్యుత్ సబ్‌స్టేషన్

నక్కపల్లి: వ్యవసాయానికి త్రీ ఫేజ్ విద్యుత్ సరఫరా అర్ధరాత్రి వేళ ఇవ్వడంతో ఇబ్బంది పడుతున్నామంటూ అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులకు ప్రభుత్వం ఇచ్చే ఉచిత విద్యుత్‌ను వేంపాడు సబ్‌స్టేషన్ పరిధిలో సగానికి పైగా రోజులు రాత్రి వేళ ఇస్తున్నారు. దీంతో ఈ ప్రాంతంలో వ్యవసాయదారులు అవస్థలు పడుతున్నారు. వారంలో మూడు రోజులపాటు ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఇస్తున్నారని, మిగిలిన రోజుల్లో రాత్రి ఒంటి గంట నుంచి ఉదయం 9 గంటల వరకు విద్యుత్ సరఫరా చేస్తున్నారని అన్నదాతలు వాపోతున్నారు. త్రీ ఫేజ్ సరఫరా ఉపయోగించుకునే మామిడి, జీడి, కొబ్బరి, అరటి, కూరగాయలు తదితర ఉద్యానవన పంటల రైతులు అర్ధరాత్రి సమయంలో పొలాల్లోకి వెళ్లేందుకు తీవ్ర భయాందోళనలు చెందుతున్నారు. తోటల్లో ఏర్పాటు చేసిన 11 కేవీ విద్యుత్‌లైన్లతో ప్రమాదం పొంచి ఉంటోందని, ఈ లైన్లు పొరపాటున తెగిపడినా, విషసర్పాల బారిన పడినా ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని రైతులు చెబుతున్నారు. గడచిన మూడు నెలల నుంచి ఈ సమస్య ఉన్నప్పటికీ పరిష్కరించేందుకు విద్యుత్ శాఖ అధికారులు చర్యలు చేపట్టడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేంపాడు సబ్‌స్టేషన్ పరిధిలో లోడ్ ఎక్కువ కావడంతో తొమ్మిది గంటలపాటు అన్ని రోజుల్లో ఒకే సమయంలో త్రీఫేజ్ విద్యుత్ సరఫరా ఇవ్వలేకపోతున్నామని సిబ్బంది చెబుతున్నారన్నారు. పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తే ఈ సమస్య పరిష్కారమవుతుందని ట్రాన్స్‌కో సిబ్బంది తెలిపారని, సబ్‌స్టేషన్‌లో కొద్ది రోజుల క్రితమే పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు పనులు పూర్తయినప్పటికీ విద్యుత్ సరఫరా మాత్రం సక్రమంగా జరగడం లేదని రైతులు చెబుతున్నారు. వేంపాడు సబ్‌స్టేషన్ పరిధిలో సుమారు 10 గ్రామాల రైతులు ఈ ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. పవర్ ట్రాన్స్‌ఫార్మర్ పని పూర్తిగా జరగలేదని, కొద్ది పనులు పెండింగ్‌లో ఉన్నాయని, కాంట్రాక్టర్ రాకపోవడం వల్ల ఈ ఇబ్బంది నెలకొందని సిబ్బంది చెబుతున్నారని రైతులు అంటున్నారు. తక్షణమే వ్యవసాయానికి తొమ్మిది గంటలపాటు త్రీఫేజ్ సరఫరాను పగటి పూట మాత్రమే ఇవ్వాలని వారు కోరుతున్నారు.

క్లుప్తంగా

అనకాపల్లి యువతకు ఉద్యోగావకాశాలు



పార్టీ శ్రేణులతో మాట్లాడుతున్న మలసాల భరత్‌కుమార్

అనకాపల్లి: తన నియోజకవర్గంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించే విధంగా చర్యలు చేపట్టినట్టు వైఎస్సార్‌సీపీ అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ అన్నారు. పార్టీ శ్రేణుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో సింగపూర్‌లో ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీతో చర్చలు జరిగాయన్నారు. అక్కడ 20 మంది నిరుద్యోగ ఇంజనీర్లకు మూడు నెలల పాటు ఉచిత శిక్షణ ఇచ్చి ఉద్యోగావకాశాలు కల్పించామన్నారు. ఒక్కొక్క నిరుద్యోగిపై నెలకు రూ.లక్ష ఖర్చు చేశానన్నారు. తమ శక్తి కొద్దీ యువతకు ఉద్యోగాలు ఇచ్చే విధంగా ప్రపంచంలో వివిధ సాఫ్ట్‌వేర్ కంపెనీలతో ఒప్పందాలు చేసుకుంటున్నామన్నారు. త్వరలో నియోజకవర్గ స్థాయి పార్టీ సమావేశం నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు.

పరిహారంగా నగదు ఇవ్వాలని డిమాండ్



మునగపాకలో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నేతలు

మునగపాక : పూడిమడక రోడ్డు విస్తరణ బాధితులకు ఇచ్చే పరిహారాన్ని నేరుగా అకౌంట్‌లో జమ చేయాల్సిందేనని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం మునగపాకలో నిర్వాసితులతో సమావేశం నిర్వహించి అనంతరం ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూడిమడక రోడ్డు విస్తరణ ఎంతో అవసరమైనప్పటికీ బాధితులకు ఇచ్చే పరిహారం విషయంలో ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయం సరికాదన్నారు. నిర్వాసితులకు టీడీఆర్ బాండ్లు ఇస్తామంటూ ప్రకటించడం సరికాదన్నారు. రహదారి విస్తరణను ప్రతి ఒక్కరూ స్వాగతించాలని, అయితే గృహాలు, వ్యవసాయ భూములు కోల్పోతున్న బాధితులకు న్యాయం చేయాలన్నారు. 2013 భూసేకరణ చట్ట ప్రకారం బాధితులకు మేలు జరగాలన్నారు. ఆర్‌అండ్‌బీలో చిరువ్యాపారాలు చేసుకునే వారిని ఆదుకోవాలన్నారు. నిర్వాసితులకు న్యాయం జరగకుంటే భవిష్యత్‌లో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కర్రి అప్పారావు, కె.సదాశివరావు, రొంగలి రాము, ఎస్.బ్రహ్మాజీ, బొడ్డేడ రామ్‌కుమార్, కాంద్రేగుల రామప్పారావు, టెక్కలి జగ్గారావు పాల్గొన్నారు.

మూగజీవాలకు ఆసరా దక్కెన్

- 13 ఏళ్లుగా పక్షుల కోసం నీటి తొట్టెల అందజేత
- వేసవిలో మూగజీవుల దాహార్తి తీరుస్తున్న కెన్ ఫౌండేషన్
- ఈ ఏడాది 500 వాటర్ బౌల్స్ పంపిణీ ప్రారంభం





నీటి తొట్టెలను పంపిణీ చేస్తున్న సీఎంఆర్ ఎండీ మావూరి వెంకటరమణ, కెన్ ప్రతినిధులు

సాక్షి, విశాఖపట్నం: వేసవి వచ్చిందంటే చాలు.. గుక్కెడు నీటి కోసం అల్లాడిపోతుంటాం. ఉష్ణతాపాన్ని తీర్చుకునేందుకు ఏదో రూపంలో శరీరానికి నీటిని అందిస్తుంటాం.. మరి మూగజీవాల పరిస్థితి ఏమిటి? చుక్క నీటికోసం మైళ్ల దూరం ప్రయాణిస్తూ ప్రాణాలు కోల్పోతున్నాయి. కొన్ని పక్షి జాతులు అంతరించిపోవడానికి వేసవి కూడా ఒక కారణమని జీవశాస్త్ర అధ్యయనాల్లో తేలింది. అందుకే మూగజీవాల దాహార్తిని తీర్చేందుకు నగరంలోని కెన్ ఫౌండేషన్ 13 ఏళ్లుగా కృషి చేస్తోంది. వేసవిలో నీటి తొట్టెలను ఉచితంగా పంపిణీ చేస్తూ.. ఎన్నో జీవాలకు ఊపిరిపోస్తోంది.

100 తొట్టెలతో ప్రారంభమై..

సేవే మార్గంగా.. విద్యార్థులు వలంటీర్లుగా 'కెన్' అధ్యక్షుడు పుల్లేటికుర్తి సంతోష్ 2012లో వాటర్ బౌల్ పేరుతో సామాజిక కార్యక్రమాన్ని ప్రారంభించారు. తొలి ఏడాది ఫౌండేషన్ వలంటీర్లే నగరంలోని పలు చోట్ల 100 నీటి తొట్టెలు ఏర్పాటు చేశారు. ఆ నీటి తొట్టెల వద్దకు పక్షులు, మూగజీవాలు వచ్చి నీటిని తాగుతుండటం చూసి నగర ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. తామూ ఈ ప్రాజెక్టులో భాగస్వాములమవుతామని ముందుకొచ్చారు. పెందుర్తి, విశాలాక్షినగర్, కొత్తవలస, స్టీల్‌ప్లాంట్, అనకాపల్లి, డాల్ఫిన్ నోస్, శివారు ప్రాంతాల నుంచి పక్షి ప్రేమికులు వచ్చి నీటి తొట్టెలను తీసుకెళ్లారు. మేడలపై, పెరట్లో వీటిని ఏర్పాటు చేశారు. దీంతో పిచ్చుకలు, రామ చిలుకలు, పావురాలు, కాకులతో పాటు ఉడతలు, ఆవులు, కుక్కలు కూడా ఈ నీటి తొట్టెల వద్దకు చేరుకుని తమ దాహార్తిని తీర్చుకుంటున్నాయి. ఇదిలా ఉండగా సంస్థ చైర్‌పర్సన్ గీతానారాయణ్ నీటి తొట్టెలకయ్యే ఖర్చును భరిస్తూ అందరికీ ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. 2017 వరకు 750 నీటి తొట్టెలు సరఫరా చేయగా.. ఆ తర్వాత నుంచి ఇప్పటి వరకు 3 వేల వరకు పంపిణీ చేశారు. ఈ ఏడాది 500 నీటి తొట్టెలను సిద్ధం చేసి, మద్దిలపాలెం సీఎంఆర్ సెంట్రల్‌లో ఆదివారం పంపిణీ ప్రారంభించారు. సీఎంఆర్ ఎండీ మావూరి వెంకటరమణ, గ్రీన్ ఫౌండేషన్ చైర్మన్ రవిశంకర్ నారాయణ్ చేతుల మీదుగా వీటిని ప్రజలకు అందజేశారు. ఇంకా ఎవరైనా పక్షి ప్రేమికులుంటే నీటి తొట్టెలను అందించేందుకు నిర్వాహకులు సిద్ధంగా ఉన్నారు.



తొట్టెల్లో నీటిని తాగుతున్న పావురాలు, రామచిలుకలు(పాతచిత్రం)

9885674949కి కాల్ చేయండి

కెన్ ఫౌండేషన్ తరపున ఈ ప్రాజెక్ట్‌ను ప్రారంభించాం. తొలుత వంద చోట్ల వీటిని ఏర్పాటు చేసి.. ఏటా కొనసాగించాలని భావించాం. ఈ ప్రాజెక్ట్‌లో భాగస్వాములవుతామని ప్రజలు ముందుకు రావడంతో మా ప్రయత్నం విజయవంతమైంది. పిచ్చుకలు, రామచిలుకలు వచ్చి ఆహారం తిని.. ఈ తొట్టెల్లో నీళ్లు తాగుతూ సేద తీరుతున్నాయని వారంతా చెబుతుంటే సంతోషంగా ఉంటుంది. ఆసక్తి ఉన్న వారికి ఉచితంగా నీటి తొట్టెలు అందిస్తాం. 98856 74949కు సంప్రదించి నీటి తొట్టెలు పొందవచ్చు.

– గీతానారాయణ్, కెన్ చైర్‌పర్సన్

రేపు అప్పన్న వార్షిక కల్యాణోత్సవం

- 3 గంటల నుంచి కొట్నాల ఉత్సవం
- సాయంత్రం 6.30 నుంచి ఎదురు సన్నాహోత్సవం
- రాత్రి 8.15 గంటల నుంచి రథోత్సవం
- రాత్రి 10.30 గంటల నుంచి వార్షిక కల్యాణ మహోత్సవం
- నేడు 7 గంటల వరకే స్వామి దర్శనం



ముస్తాబవుతున్న కల్యాణ వేదిక (ఇన్‌సెట్) అప్పన్న ఉత్సవమూర్తులు

సింహాచలం: చైత్ర శుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని సింహగిరిపై కొలువైన శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి వార్షిక కల్యాణ మహోత్సవం మంగళవారం రాత్రి జరగనుంది. సింహగిరిపై ఉత్తర రాజగోపురం ఎదురుగా ఉన్న ప్రాంగణంలో కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు సింహాచల దేవస్థానం వైదిక, అధికార వర్గాలు ఏర్పాట్లు చేస్తున్నాయి. పాంచరాత్ర ఆగమ శాస్త్రాన్ని అనుసరించి మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు ఆలయ నీలాద్రి గుమ్మం వద్ద అర్చకులు, ముత్తైదువులు పసుపు కొమ్ములను దంచి కొట్నాలు ఉత్సవం నిర్వహిస్తారు. అనంతరం ముక్కోటి దేవతలకు కల్యాణోత్సవ ఆహ్వానం పలుకుతూ ఆలయ ధ్వజస్తంభం వద్ద గరుడాళ్వార్ చిత్రపటాన్ని ఎగురవేసి ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. సాయంత్రం 6.30 గంటల నుంచి ఎదురుసన్నాహోత్సవాన్ని నిర్వహిస్తారు. స్వామి ఉత్సవమూర్తి గోవింద రాజస్వామిని బంగారు చాయ పల్లకీలో, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను ముత్యాల పల్లకీలో ఉంచి మాడ వీధుల్లో ఊరేగింపుగా తీసుకెళ్తారు. జోడుభద్రాల ఎదురెదురుగా ఏర్పాటు చేసిన వేదికలపై అధిష్ఠింపజేస్తారు. అక్కడ ఎదురు సన్నాహోత్సవం నిర్వహిస్తారు. అనంతరం స్వామిని, అమ్మవార్లను రథంపై అధిష్ఠింపజేసి రాత్రి 8.15 గంటల నుంచి మాడ వీధుల్లో రథోత్సవం నిర్వహిస్తారు. రాత్రి 10.30 గంటల నుంచి ఉత్తర రాజగోపురం ఎదురుగా ప్రాంగణంలో ఏర్పాటు చేస్తున్న భారీ వేదికపై వార్షిక కల్యాణ మహోత్సవం నిర్వహిస్తారు. ఈ ఉత్సవానికి సోమవారం రాత్రి అంకురార్పణ చేస్తారు. ఈ కారణంగా సోమవారం రాత్రి 7 గంటల వరకే భక్తులకు దర్శనాలు లభిస్తాయి.

విశేషంగా ఏర్పాట్లు : రథోత్సవం, కల్యాణోత్సవం కోసం దేవస్థానం ఇన్‌చార్జి ఈవో కె.సుబ్బారావు ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు జరుగుతున్నాయి. దేవస్థానం ప్రాంగణంలో భారీ కల్యాణ వేదికను తీర్చిదిద్దుతున్నారు. సాధారణ భక్తులతో పాటు వీఐపీలు, వీవీఐపీల కోసం ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న 164 సీసీ కెమెరాలకు అదనంగా కల్యాణోత్సవ ప్రాంగణంలో మరో 20 సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. భక్తులకు ఆరు వేల చిన్న లడ్డూ ప్రసాదంతో పాటు ముత్యాల తలంబ్రాల ప్యాకెట్లను ఉచితంగా పంపిణీ చేయనున్నారు. మధ్యాహ్నం అన్నదాన భవనంలో 5 వేల మందికి, రాత్రి 6 వేల మందికి అన్నప్రసాద వితరణ ఉంటుంది. మంగళవారం సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి కల్యాణం ముగిసే వరకు కొండపైకి 10 షటిల్ బస్సులు నడుస్తాయని సింహాచలం డిపో మేనేజర్ రాజశేఖర్ వెల్లడించారు. కల్యాణం పూర్తయిన తర్వాత నగరంలోని వివిధ ప్రాంతాలకు బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. 120 మంది పోలీసులతో భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు సీఐ గొలగాని అప్పారావు పేర్కొన్నారు.

గంజాయితో ఐదుగురు అరెస్టు



గంజాయి నిందితులను రిమాండ్‌కు తరలిస్తున్న అచ్యుతాపురం పోలీసులు

అచ్యుతాపురం రూరల్: కొండకర్లలో అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న ఐదుగురు వ్యక్తులను అచ్యుతాపురం పోలీసులు ఆదివారం అదుపు లోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 2 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్టు సీఐ నమ్మి గణేష్ తెలిపారు. వీరిలో నలుగురు అచ్యుతాపురం మండలానికి చెందిన వారు కాగా మరొకరు అనకాపల్లికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. చింతగుంట పవన్, పప్పల సాయి కుమార్, పోలవరపు వేణు, బెల్లంకొండ మహేంద్ర వర్మ, అప్పికొండ మణికంఠ బానులు వీరంతా మరో ప్రాంతం నుంచి గంజాయి అక్రమంగా రవాణా చేస్తూ కొంత గంజాయి సేవించి మరికొంత నిల్వచేసారన్నారు. అందిన సమాచారం మేరకు సీఐ గణేష్, ఎస్ఐలు సుధాకర్, వెంకటరావు వారి సిబ్బందితో గంజాయి సేవిస్తున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామన్నారు.

అయ్యో.. కూర్మం

ఇటీవల కాలంలో సముద్రంలో తాబేళ్ల మృతి చెందడం ఆందోళన కలిగిస్తోంది. చనిపోయిన తాబేళ్లు పెద్ద సంఖ్యలో తీరానికి కొట్టుకొస్తున్నాయి. ఆదివారం వీఎంఆర్డీ పార్కు బీచ్‌లో ఒక తాబేలు మృతదేహం కొట్టుకురాగా.. దానిని కుక్కలు పీక్కుతింటున్న దృశ్యం కలచివేసింది. సముద్రంలో తాబేళ్ల మరణాల పట్ల పర్యావరణ వేత్తలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



సముద్ర జీవుల సంరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

నూకాంబిక అమ్మవారి ఆలయానికి పోటెత్తిన భక్తులు



నూకాంబిక అమ్మవారిని బాలాలయంలో దర్శించుకున్న భక్తులు

అనకాపల్లి : గవరపాలెం నూకాంబిక అమ్మవారి బాలాలయంలో అమ్మవారిని ఆదివారం భక్తులు పోటెత్తారు. నూకాంబిక అమ్మవారి నెల పండుగను రాష్ట్ర పండగగా గుర్తించడంతో భక్తుల రద్దీ పెరిగింది. అమ్మవారి నెల జాతర ఈనెల 27వ తేదీ వరకూ నిర్వహించడం జరుగుతుందని ఈవో వెంపలరాం రాంబాబు చెప్పారు. అమ్మవారి ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దేవదాయశాఖ ఉద్యోగులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. కొంతమంది భక్తులు అమ్మవారి ఆలయం వద్ద చలువ పందిళ్ల వద్ద కుటుంబ సమేతంగా వంటలు చేసుకుని అమ్మవారికి నైవేద్యం సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. పలు స్వచ్ఛంద సేవా సంస్థలు ప్రతినిధులు భక్తులకు మజ్జిగ, తాగునీరు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాగశ్రీను(గొల్లబాబు), కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రమ్యమైనది రామనామం



సీతారాములను దర్శించుకుంటున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు దంపతులు

నర్సీపట్నం: అతి పురాతన దేవాలయమైన నర్సీపట్నం కోమటి వీధి రామాలయంలో శ్రీరామనవమి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. వెలమ వీధి రామాలయంలోని శ్రీసీతారాముల కళ్యాణ మహోత్సవంలో స్పీకర్ సిహెచ్.అయ్యన్నపాత్రుడు, పద్మావతి దంపతులు పాల్గొ న్నారు. స్వామి వారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు, మంగళసూత్రాలు సమర్పించారు.



తారువలో అన్న సమారాధనలో పాల్గొన్న మాజీ డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు

తారువలో మాజీ డిప్యూటీ సీఎం బూడి..

దేవరాపల్లి: తారువలో జరిగిన శ్రీరామనవమి వేడుకల్లో మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు దంపతులు పాల్గొని సీతారాములు వారిని దర్శించుకున్నారు. అనంతరం జరిగిన అన్నసమారాధనలో ముత్యాలనాయుడు వడ్డన చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు మాజీ డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు శుభాకాంక్షలు తెలియజేశారు.

నేడు చాపరాయి పర్యాటక కేంద్రంలో ప్రవేశం రద్దు

డుంబ్రిగుడ: మండలంలో డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ పర్యటన నేపథ్యంలో సోమవారం చాపరాయి పర్యాటక కేంద్రంలో ప్రవేశం రద్దు చేసినట్టు పాడేరు జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పర్యాటకులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

విశాఖ ఉక్కు ఉత్పత్తులకు మార్కెట్‌లో ఒక ప్రత్యేక గుర్తింపు ఉంది. వినియోగదారులు విశాఖ ఉక్కు బ్రాండ్‌ను విశ్వసించి కొనుగోలు చేయడానికి ప్రధాన కారణం ఆ కంపెనీ బ్రాండ్ ఇమేజ్. స్టీల్‌ప్లాంట్‌లో ఉత్పత్తులపై లోగో ముద్రణ వెనుక ఒక ఆసక్తికరమైన కథ ఉంది. ఉక్కు ఉత్పత్తుల తయారీలో రోల్స్ కీలక పాత్ర పోషిస్తాయి. ఈ రోల్స్‌పైనే వైజాగ్ స్టీల్ టీఎంటీ ముద్రను వేస్తారు. రీబార్స్, రౌండ్స్, యాంగిల్స్, చానల్స్, బీమ్స్ వంటి వివిధ ఉత్పత్తులపై 6 ఎం.ఎం నుంచి 36 ఎం.ఎం. వరకు వివిధ పరిమాణాలలో ఈ బ్రాండింగ్ ప్రక్రియ జరుగుతుంది. మొదట్లో పెద్ద సైజు నంబర్ పంచ్ అనే సాధనంతో బ్రాండింగ్ చేసేవారు. 2002 తర్వాత నేరుగా ఉత్పత్తి మీద ముద్రపడేలా ఏర్పాట్లు చేశారు.


– ఉక్కునగరం



స్టీల్‌ప్లాంట్‌లో వైర్ రాడ్ కాయిల్స్ తయారీ

ఇదీ సార్.. వైజాగ్ స్టీల్ బ్రాండ్

- నాణ్యమైన ఉక్కు ఉత్పత్తులు స్టీల్‌ప్లాంట్‌కే సొంతం
- 6 నుంచి 36 మి.మీ వరకు రీబార్స్, చానల్స్
- ఐబీమ్స్‌కు రోల్స్ తయారీ ఇక్కడే..
- ప్రతి ఉత్పత్తిపై వైజాగ్ స్టీల్ టీఎంటీ ముద్ర
- 2002 నుంచి బ్రాండ్ మార్క్‌తో మార్కెట్‌లోకి ఉత్పత్తులు



బ్రాండింగ్ ఎలా ప్రారంభమైంది

విశాఖ ఉక్కు ఉత్పత్తులను మొదట్లో ఇతర కంపెనీల ఉత్పత్తుల్లాగే మార్కెట్‌లో అమ్మేవారు. ఇతర ఉత్పత్తుల్లో విశాఖ ఉక్కు ఉత్పత్తులను వినియోగదారులు గుర్తించడం కష్టంగా ఉండేది. దీంతో అప్పటి సీఎండీ శివసాగర్‌రావు ఏదైనా గుర్తు ఉంటే బాగుంటుందని ఆలోచించి.. రీబార్స్ మధ్యలో ఆంగ్ల అక్షరం 'వి'ఉండేలా చేశారు. అది ఎంతో కష్టపడితే తప్ప స్పష్టంగా కనిపించేది కాదు. ఆ తర్వాత, ఉత్పత్తులపై ప్రారంభంలో బ్రాండింగ్ కోసం పెద్ద సైజు నంబర్ పంచ్ అనే సాధనంతో 'వైజాగ్ స్టీల్'అని కొట్టేవారు. ఇది చాలా శ్రమతో కూడుకున్న పని. అన్ని ఉత్పత్తుల మీద ముద్రించాలంటే ఎక్కువ శ్రమ, సమయం పట్టేది. 2002 తర్వాత నేరుగా ఉత్పత్తి మీద ముద్రపడేలా అధికారులు ఏర్పాట్లు చేశారు.



సీఎన్‌సీ మిషన్‌పై నాచ్ తయారు చేస్తున్న దృశ్యం

ఉత్పత్తుల మార్కెటింగ్‌లో ప్రధాన భూమిక వహించేది బ్రాండ్ ఇమేజ్. బ్రాండ్‌ను చూసే వినియోగదారులు వస్తువులు కొనుగోలు చేస్తారనేది విశ్వజనీనం. అందుకే ప్రతీ సంస్థ తమ ఉత్పత్తుల నాణ్యతతో పాటు బ్రాండ్ ఏర్పాటుకు అధిక ప్రాధాన్యమిస్తాయి. దేశీయ ఉక్కు పరిశ్రమలో తమ బ్రాండ్‌ను ముద్రించడంలో విశాఖ ఉక్కు కర్మాగారం తనదైన ప్రత్యేకత కలిగి.. మార్కెట్‌లో ప్రతిష్ట కలిగి ఉందనడంలో ఎటువంటి సందేహం లేదు. స్టీల్‌ప్లాంట్ తుది ఉత్పత్తులు రోలింగ్ మిల్స్ విభాగాలైన లైట్ అండ్ మీడియం మర్చంట్ మిల్(ఎల్.ఎం.ఎం.ఎం), మీడియం మర్చంట్ అండ్ స్ట్రక్చరల్ మిల్(ఎం.ఎం.ఎస్.ఎం), వైర్ రాడ్ మిల్స్(డబ్ల్యూ.ఆర్.ఎం), స్పెషల్ బార్ మిల్(ఎస్.బి.ఎం), వైర్ రాడ్ మిల్(డబ్ల్యూఆర్ఎం)–2, స్ట్రక్చరల్ మిల్ (ఎస్టీఎం)లలో తయారవుతాయి. ఆయా విభాగాల్లో రీబార్స్, రౌండ్స్, యాంగిల్స్, చానల్స్, బీమ్స్ తదితర వస్తువులను ఉత్పత్తి చేస్తారు. ఆ ఉత్పత్తుల తయారీకి అవసరమైన గైడ్ల తయారీని రోల్ షాప్ అండ్ రిపేర్ షాప్(ఆర్ఎస్ అండ్ ఆర్ఎస్) విభాగం చేపడుతుంది. 6 మిల్లీమీటర్ల వ్యాసం నుంచి 36 మిల్లీమీటర్ల వరకు ఉన్న రీబార్లు, చానల్స్, ఐబీమ్స్‌లకు రోలింగ్ అవసరమైన రోల్స్‌ను ఇక్కడే తయారు చేస్తారు. నిర్ణీత పరిమాణంలో ఆ రోల్స్‌ను సిద్ధం చేసిన తర్వాత, దానిపై విశాఖ ఉక్కుకు ప్రతిష్టగా నిలిచే వైజాగ్ స్టీల్ టీఎంటీ(థర్మో మెకానికల్ ట్రీట్‌మెంట్) ముద్రను ముద్రిస్తారు.

కీలక విభాగాలకు రోల్స్ తరలింపు

కర్మాగారంలో తయారయ్యే ఉత్పత్తులపై ముద్ర వేసేందుకు సిద్ధం చేసిన రోల్స్‌ను ఆర్ఎస్ అండ్ ఆర్ఎస్–1, 2 విభాగాల నుంచి ఉత్పత్తులు తయారయ్యే మిల్స్ విభాగాలకు సరఫరా చేస్తారు. అక్కడ తయారవుతున్న ఉత్పత్తులపై వైజాగ్ స్టీల్, విశాఖ ఉక్కు వంటి లోగోలను ముద్రిస్తారు.

నకిలీకి ఆస్కారం లేకుండా..

జాతీయ, అంతర్జాతీయ విపణిలో విశాఖ ఉక్కు ఉత్పత్తులకు ఉన్న గిరాకీని బట్టి తరచూ నకిలీ ఉత్పత్తులు తయారవుతున్నట్టు యాజమాన్యానికి తెలిసింది. దీంతో ఎక్కడా డూప్లికేటింగ్ జరగకుండా బ్రాండింగ్ చేయడానికి అన్ని రకాల చర్యలు తీసుకుంది. అందులో భాగంగా ఇప్పుడు ఉత్పత్తి గ్రేడును కూడా తెలిపే విధంగా ఎంతో సాంకేతిక పరిజ్ఞానంతో ఈ బ్రాండింగ్ చేస్తున్నారు. వైజాగ్ టీఎంటీ 500డి, వైజాగ్ టీఎంటీ హెచ్‌సీఆర్‌డీ అనేవి ఇప్పటి వరకు ముద్రిస్తూ వచ్చారు. కొత్తగా కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు వైజాగ్ టీఎంటీ ఎఫ్ఈ 550డి, 500డి 6686 59, 8568 66 అనే బ్రాండ్ నంబర్లు ముద్రించడం ఇటీవల ప్రారంభించారు. 16ఎంఎం నుంచి 36 ఎంఎం వరకు ఉన్న సైజు ఊచలపై, రైల్వే సంస్థకు పంపే ఉత్పత్తులపై హెచ్‌సీఆర్‌డీ(హై కరోజన్ రెసిస్టెంట్ డక్టైల్)ను ముద్రిస్తున్నారు.

లోగో ఎలా ముద్రిస్తారంటే.?

రోల్స్‌ను సీఎన్‌సీ లేత్ మిషన్ మీద కావాల్సిన పరిమాణంలో గాడి(గ్రూవ్స్) చేసి, గ్రూవ్స్‌లో రీబార్ నాచ్ చేసి అనంతరం స్పార్కోనిక్స్ బ్రాండింగ్ మిషన్ మీదకు రోల్‌ను ఎక్కిస్తారు. స్పార్కోనిక్స్ బ్రాండింగ్ మిషన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ (పుణే) సరఫరా చేసిన ఈ మిషన్‌ను కంప్యూటర్ ద్వారా అనుసంధానం చేస్తారు. తద్వారా రోల్ మీద సుమారు 1.3 ఎం.ఎం నుంచి 1.9 ఎం.ఎం లోతులో అక్షరం ముద్ర పడుతుంది. అలా ఒక్కో అక్షరం ముద్రిస్తారు. కొన్ని సందర్భాల్లో నాలుగైదు అక్షరాలను ముద్రించే అవకాశం ఉన్నట్లు మిషన్ ఆపరేటర్ తెలిపారు. ఇక్కడ 16 ఎం.ఎం రీబార్ నుంచి 36 ఎం.ఎం రీబార్ వరకు బ్రాండింగ్ చేస్తారు. ఒక్కో రోల్‌కు సుమారు 5 గంటల సమయం పడుతుండగా.. ఇటీవల మార్చిన లోగోకు 6–7 గంటలు పట్టవచ్చునని ఉద్యోగులు తెలిపారు.

నేటి నుంచి ఎన్టీఆర్ వైద్యసేవ బంద్

- నెట్‌వర్క్ ఆస్పత్రులకు బిల్లులు చెల్లించని కూటమి ప్రభుత్వం
- సోమవారం నుంచి సేవలు నిలిపివేస్తున్నాం: ఆషా



మహారాణిపేట: జిల్లాలో నెట్‌వర్క్ ఆస్పత్రులు ఎన్టీఆర్ వైద్య సేవను నిలిపివేస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం నెట్‌వర్క్ ఆస్పత్రులకు బిల్లులు చెల్లించకపోవడంతో సోమవారం నుంచి అన్ని రకాల ఎన్టీఆర్ వైద్య సేవలను నిలిపివేస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ స్పెషాలిటీ హాస్పిటల్ అసోసియేషన్(ఆషా) ప్రకటించింది. విశాఖపట్నంలో దాదాపు 102 నెట్‌వర్క్ ఆస్పత్రులు ఈ నిర్ణయం తీసుకున్నాయి. ఈ సందర్భంగా ఆషా జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎం. మురళీకృష్ణ మాట్లాడుతూ బకాయిల కారణంగా ఆస్పత్రుల నిర్వహణ కష్టంగా మారిందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా నెట్‌వర్క్ ఆస్పత్రులకు దాదాపు రూ.3,500 కోట్ల బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సి ఉందని, దీని వల్ల ఆస్పత్రులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలనే ఉద్దేశంతో నెట్‌వర్క్ ఆస్పత్రులు చిత్తశుద్ధితో పనిచేస్తున్నప్పటికీ, ఆర్థిక భారం మోయలేనంతగా పెరిగిందన్నారు. ఇప్పటికే అనేక ఆస్పత్రులు బ్యాంకుల నుంచి ఓవర్ డ్రాఫ్ట్‌లు, ప్రైవేటు సంస్థల నుంచి వడ్డీలకు అప్పులు తెచ్చి ఆస్పత్రులను నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంటుందన్నారు. ఈ పథకం అమలు చేస్తున్న అన్ని నెట్‌వర్క్ ఆస్పత్రులు పూర్తిగా పరపతిని కోల్పోతున్నాయన్నారు. మరోవైపు రోగులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆరోగ్యశ్రీ సమన్వయకర్త డాక్టర్ అప్పారావు తెలిపారు. అయితే.. నెట్‌వర్క్ ఆస్పత్రులు సేవలు నిలిపివేయడం పట్ల పేదలు ఆందోళన చెందుతున్నారు.

క్లుప్తంగా

క్రీడలతో మానసికోల్లాసం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న శ్రీరామచంద్రమూర్తి

అనకాపల్లి టౌన్: క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్ అన్నారు. స్థానిక జార్జ్ క్లబ్ ఆవరణలో శరగడం మహాలక్ష్మి 66వ జయంతి సందర్భంగా మూడు రోజుల నుంచి నిర్వహిస్తున్న క్రీడా పోటీలు ఆదివారంతో ముగిశాయి. రామచంద్ర చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన షటిల్ బ్యాడ్మింటన్, లాంగ్ టెన్నిస్, టేబుల్ టెన్నిస్, క్యారమ్స్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో శరగడం శ్రీరామచంద్రమూర్తి, దాడి ఈశ్వరరావు, జార్జ్ క్లబ్ అధ్యక్షుడు బీఎంఎస్‌కే జోగినాయుడు, క్లబ్ మెంబర్స్ ఆడారి హరిప్రభాకర్, బీశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అపార్టుమెంట్లకు సీసీ కెమెరాలు తప్పనిసరి



సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని నోటీస్ అందజేస్తున్న కానిస్టేబుల్

అనకాపల్లి టౌన్: పట్టణంలో అపార్ట్‌మెంట్స్, షాపింగ్ మాల్స్‌కు తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని పట్టణ ఎస్‌ఐ అల్లు వెంకటేశ్వరావు సూచించారు. ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు ఏపీ ప్రజా భద్రత చట్టం ప్రకారం సీసీ కెమెరాలు అమర్చుకోవాలన్నారు. ఆదివారం తమ సిబ్బందితో పలువురి అపార్ట్‌మెంట్ యజయానులకు నోటీసులు అందజేశామని ఎస్‌ఐ తెలిపారు.

వేడుకగా ఊంజల్ సేవ

కశింకోట: స్థానిక గవరపేటలో ఊయల సేవ, పుష్పాంజలి, పవళింపు సేవ ఆదివారం కనుల పండువగా నిర్వహించారు. శ్రీరామనవమి పురస్కరించుకొని కల్యాణోత్సవ సీతారాములు, లక్ష్మణ, ఆంజనేయ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ వ్యవస్థాపక ధర్మకర్త భీశెట్టి దుర్గా నాగేశ్వరరావు, అర్చకుడు సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఉచిత పాలిసెట్ శిక్షణకు ఆదరణ

ఎస్.రాయవరం: పెదగుమ్ములూరు ఉన్నత పాఠశాలలో ప్రారంభించిన ఉచిత పాలిసెట్ శిక్షణకు ఆదివారం 79 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇక్కడ పీఆర్టీయూ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిక్షణ చాలా ప్రయోజనకరంగా ఉందని వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దాతలు స్టడీ మెటీరియల్ సమకూర్చేందుకు ముందుకు వస్తున్నారని మండల కార్యదర్శి శ్రీనివాసరావు చెప్పారు. ఈ శిక్షణ కేంద్రానికి ఎస్.రాయవరం మండలం ఎస్.రాయవరం, కొరుప్రోలు, పెదఉప్పలం, తిమ్మాపురం, చినగుమ్ములూరు, పెనుగొల్లు, యలమంచిలి మండలం బయ్యవరం, కొక్కిరాపల్లి, కోటవురట్ల మండలం పందూరు, రామచంద్రపురం, నక్కపల్లి మండలం గొడిచర్ల, తీనార్ల, దొండవాక, నక్కపల్లి, డీఎల్ పురం గ్రామాల నుంచి విద్యార్థులు వస్తున్నారన్నారు. 45 రోజులు పాటు కోచింగ్ ఇచ్చేందుకు 9 మందిని ఉపాధ్యాయులను నియమించామన్నారు.

అనకాపల్లి సినిమాలు

రాజా	:మాడ్ స్క్వేర్
సత్యనారాయణ స్క్రీన్-1	: రాబిన్‌హుడ్
సత్యనారాయణ స్క్రీన్-2	:రాజుగారి దొంగలు
పర్తిసాయి	:కోర్టు
షిర్డీసాయి	:లైఫ్
వెంకటేశ్వర	:ఆదిత్య 369
శ్రీసత్య	:సంక్రాంతికి వస్తున్నాం.
రామచంద్ర	:వీరధీరశూర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 27 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-6 యూనిట్లు , బీ పాజిటివ్-10 యూనిట్లు, ఓ పాజిటివ్-10 యూనిట్లు ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 236 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 119 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.

జగదభిరాముని కల్యాణం..
చూసిన కనులదే వైభోగం

ఊరంతా పందిళ్లు... మదినిండా భక్తి పరవళ్లు.. జనక రాజ పుత్రిక జానకీదేవికి దశరథ సుతుడు శ్రీరామచంద్రుడి కల్యాణం ఆదివారం కమనీయంగా జరిగింది. వాడవాడలా సీతారాముల కల్యాణాన్ని వేడుకగా నిర్వహించారు. అభిజిత్ లఘ్నంలో సీతమ్మ, రామయ్య శిరస్సులపై అర్చకస్వాములు జీలకర్ర, బెల్లం ఉంచారు. కల్యాణ విశిష్టతను వివరిస్తుండగా, వివాహ తంతు పూర్తి చేశారు.

వాడవాడలా రాములోరి కల్యాణం
వేడుకగా శ్రీరామనవమి
భక్తులతో రామాలయాల కిటకిట



మెయిన్‌రోడ్ చేపలబజార్ వద్ద అన్న సమారాధనలో పాల్గొన్న భక్తులు



సీతారాముల కల్యాణంలో మంగళసూత్రాలను చూపిస్తున్న అర్చకులు



విజయరామరాజుపేట రామాలయాన్ని దర్శించుకున్న మలసాల భరత్‌కుమార్



అన్న సమారాధన

అనకాపల్లి/అనకాపల్లి టౌన్: పట్టణ, మండలంలో శ్రీరామనవమి వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. వేకువజాము నుంచే ఆలయాలకు భక్తులు పోటెత్తారు. పలు చోట్ల సీతారాముల కల్యాణోత్సవాలు కమనీయంగా సాగాయి. రాములోరి పరిణయోత్సవాన్ని కనులారా తిలకించిన జనం పరవశించిపోయారు. ఉత్సవాన్ని పురస్కరించుకొని పలు చోట్ల భారీ ఎత్తున అన్నసమారాధనలు నిర్వహించారు. కళ్యాణోత్సవాలలో పాల్గొన్న భక్తులు జైశ్రీరాం..జైజైశ్రీరాం అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. పట్టణంలో వేల్పులవీధి, కోట్నివీధి, చిన్నవీధి, చేపలబజార్, నర్సింగ్‌రావు పేట, రింగ్‌రోడ్డు, పూడిమడకరోడ్, గవరపాలెం, అంబేడ్కర్ నగర్, అగ్గిమర్రి చెట్టు, మండలంలోని తుమ్మపాల, మార్టూరు, బవులువాడ, గోపాలపురం, అక్కిరెడ్డిపాలెం, సీతానగరం, జీవీఎంసీ విలీన గ్రామాల్లో జరిగిన సీతారామా కళ్యాణోత్సవాలలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మలసాల భరత్ కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేల్పులవీధి రామాలయంలో జరిగిన వేడుకలలో పాల్గొని రాములోరిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రతినిధులు భరత్‌కుమార్‌ను శాలువాతో సత్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రశాంతమైన వాతావరణంలో సీతారాముల కల్యాణం నిర్వహించడం శుభపరిణామమన్నారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, బొండా శంకర్రావు, ఉగ్గిన అప్పారావు, జెట్టి శ్రీను, మద్దాల చలపతి, కొంకి శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు. గవరపాలెం పెదబోయగూడెం వద్ద జరిగిన సీతారాముల కళ్యాణోత్సవంలో 80వ వార్డు ఇన్‌చార్జి కేఎం నాయుడు దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. గవర పాలెం పెదరామ స్వామి ఆలయంలో సీతారామ కళ్యాణ వేడుకలు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ ఆధ్వర్యంలో జరిగాయి. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు దాడి వీరభద్రరావు దంపతులు, దాడి ప్రభాకర్, దాడి జైవీర్ పాల్గొన్నారు. గవరపాలెం చినరామస్వామి ఆలయంలో జరిగిన కార్యక్రమంలో ఆలయ వంశపారంపర్య ధర్మకర్త విల్లూరి మహాలక్ష్మినాయుడు, మున్సిపల్ మాజీ చైర్మన్ విల్లూరి పైడారావు, తదితరులు పాల్గొన్నారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన జరిగింది. మెయిన్‌రోడ్ చేపలబజార్ వద్ద కళ్యాణోత్సవంలో రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, మున్సిపల్ మాజీ చైర్మన్ కొణతాల జగన్, కొనుతుల నారాయణరావు మాస్టర్, ఎస్టీ గ్రూప్ కాండ్రేగుల శ్రీరామ్, తదితరులు పాల్గొన్నారు. అన్న సమారాధనలో భక్తులు పాల్గొన్నారు. రింగ్‌రోడ్ వద్ద జరిగిన కళ్యాణ మహోత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్ని పూజలు చేశారు. కార్యక్రమంలో ఏడువాకల నారాయణరావు, కోడూరు త్రినాథరావు, రామారావు తదితరులు పాల్గొన్నారు. కొత్తూరు నర్సింగ్‌రావుపేట రామాలయంలో సీతారాముల కళ్యాణం వేద పండితుల ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమంలో సీతారామ మహిళా సేవా సంఘం సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

కశింకోట: రామాలయాలు రామ నామస్మరణతో మార్మోగాయి. సీతారాముల కల్యాణోత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. భక్తులు ఆద్యంతం కనులారా తిలకించి భక్తి పారవశ్యం చెందారు. భారీ అన్న సమారాధనలు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు కనువిందు చేశాయి. కశింకోట జాతీయ రహదారి పక్కన దేవాదాయ శాఖకు చెందిన కోదండ సీతారామచంద్ర మూర్తి స్వామి ఆలయంలో సీతారాముల కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా వేద మంత్రాల నడుమ నిర్వహించారు. భక్తులు ఆద్యంతం కనులారా తిలకించి భక్తి పారవశ్యంతో ఆనంద పరవశులయ్యారు. హౌసింగ్ కాలనీకి చెందిన భక్తులు సారె ఊరేగింపుగా బాణసంచా కాలుస్తూ డప్పులు, వాయిద్యాలతో తరలి వచ్చి స్వామివార్లకు నివేదించి పూజలు చేశారు. ఆలయంలో యువ చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు రేజేటి మారుతి ఆధ్వర్యంలో సీతారాముల విగ్రహాలను అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్న సమారాధన నిర్వహించారు. మారుతితో కలిసి ఆలయ కమిటీ అధ్యక్షుడు తాకాశి కృష్ణ, ఆలయ ఈవో ఎస్.సత్యనారాయణమూర్తి ప్రారంభించారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు వేదుల వెంకటశాస్త్రి, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ తగరంపూడి నూకరాజు, తదితరులు పాల్గొన్నారు.

కస్పావీధిలో సామూహికంగా దంపతులతో కల్యాణం

కశింకోటలోని కస్పావీధి రామాలయంలో పలువురు దంపతులు సామూహికంగా సీతారాముల కల్యాణోత్సవాన్ని జరిపించారు. పురోహితుడు నెరసావర్జుల ధనబాబు ఆధ్వర్యంలో వేద మంత్రాల నడుమ ఉత్సవ విగ్రహాలకు కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున అన్న సమారాధనలు జరిగాయి. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ సిదిరెడ్డి శ్రీనివాసరావు, కోదండ రామాలయ కమిటీ మాజీ చైర్మన్ శిష్టి అప్పారావు, ఎంపీటీసీ సభ్యురాలు నడిపల్లి గంగాభవాని, మాజీ ఉప సర్పంచ్ నడిపల్లి సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు. పూసర్ల వీధిలోని రామాలయంలో మూల విరాట్ సీతారాముల విగ్రహాలకు నేరుగా కల్యాణాన్ని శాస్త్రోక్తంగా పురోహితుడు నెరసావర్జుల పండు నిర్వహించారు. పెద్ద ఎత్తున అన్న సమారాధన నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు తగరంపూడి గణపతి, తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. కనకమహాలక్ష్మి వీధి రామాలయంలో సీతారాముల కల్యాణోత్సవాన్ని పురోహితుడు నెరసావర్జుల శర్మ వేద మంత్రాల నడుమ నిర్వహించారు. పెద్ద ఎత్తున అన్న సమారాధన నిర్వహించారు. ఎంపీటీసీ మాజీ సభ్యుడు దాడి నాగరాజు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. స్థానిక ఎస్సీ కాలనీ రామాలయం, లక్ష్మీనృసింహస్వామి ఆలయంలోని ఆంజనేయస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణోత్సవాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. బయ్యవరం, వెదురుపర్తి, తాళ్లపాలెం, కొత్తపల్లి, బుచ్చియ్యపేట, సోమవరం, ఏఎస్ పేట, గొబ్బూరు, జెట్టపురెడ్డితుని, నూతలగుంటపాలెం , ఏనుగుతుని, అచ్చెర్ల, తేగాడ, పేరంటాలపాలెం , ఉగ్గినపాలెం, పరవాడపాలెం, జమాదులపాలెం , విసన్నపేట, జి. భీమవరం, లాలంకొత్తూరు, కన్నూరుపాలెం, తీడ, చెరకాం తదితర గ్రామాల రామాలయాల్లో సీతారాముల కల్యాణోత్సవాలు, అన్న సమారాధనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

శారదా గణపతి రామాలయంలో...

గవరపేటలోని శారదా గణపతి రామాలయంలో సీతారాముల ఉత్సవ విగ్రహాలను ముందుగా డప్పులు, వాయిద్యాలు, మహిళల కోలాటాలతో బాణసంచా కాలుస్తూ సారె ఊరేగింపుతో గ్రామవీధుల్లో పల్లకిలో ఊరేగించారు. అనంతరం ఆలయం వద్ద ఏర్పాటు చేసిన వేదికపై వేద మంత్రాల నడుమ శాస్త్రోక్తంగా కొణతాల ఈశ్వరరావు దంపతులు సీతారాముల ఉత్సవ విగ్రహాలకు కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. స్వామికి నివేదించిన పెద్ద లడ్డూ వేలం పాట నిర్వహించారు. అర్చకుడు సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో మూల విరాట్ సీతారాముల విగ్రహాలకు ప్రత్యేక పూజలు జరిగాయి. మధ్యాహ్నం అన్న సమారాధన జరిగింది. అనంతరం మహిళల కోలాటాలు ప్రదర్శించి అలరించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త భీశెట్టి దుర్గా నాగేశ్వరరావు, అధ్యక్షుడు భీశెట్టి కల్యాణ చక్రవర్తిల ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు.



కల్యాణాన్ని నిర్వహిస్తున్న దంపతులు



మెయిన్‌రోడ్ చేపలబజార్ రామాలయం వద్ద కల్యాణంలో పాల్గొన్న భక్తులు



మహిళల కోలాటాల ప్రదర్శన



వేల్పులవీధి రామాలయం వద్ద సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



గవరపేట రామాలయంలో నిర్వహిస్తున్న పూజలు



వేల్పులవీధి రామాలయం వద్ద జరిగే కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు



రింగ్‌రోడ్‌లో సీతారాముల కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు



అన్న సమారాధన నిర్వహణ



కశింకోట పూసర్ల వీధిలో మూల విరాట్ సీతారాముల విగ్రహాలకు నిర్వహిస్తున్న కల్యాణం



వేల్పులవీధిలో సీతారాముల ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఊరేగిస్తున్న భక్తులు



గవరపాలెం పెదబోయగూడెం రామాలయంలో కల్యాణం చేస్తున్న కేఎం నాయుడు దంపతులు



కశింకోట కస్పావీధి రామాలయం వద్ద సీతారాముల కల్యాణం



గవరపాలెం చినరామస్వామి ఆలయాన్ని దర్శించుకున్న పీలా గోవింద్, దాడి రత్నాకర్



రింగ్‌రోడ్‌లో అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు



కోదండ సీతారామాలయంలో రేజేటి మారుతి నిర్వహిస్తున్న పూజలు



కల్యాణాన్ని తిలకిస్తున్న భక్త జనం



కశింకోట గవరపేటలో శారదా గణపతి రామాలయం వద్ద సీతారాముల కల్యాణం



సీతారాముల విగ్రహాలు పల్లకిలో ఊరేగింపు



గవరపేటలో కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

పార్టీ కోసం పనిచేసిన ప్రతి ఒక్కరికీ పదవులు

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్

అనకాపల్లి: కొత్తగా పదవులు పొందిన వారు రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని గ్రామీణ స్థాయి నుంచి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ కోరారు. స్థానిక రింగ్‌రోడ్డు పార్టీ కార్యాలయంలో పార్టీ పట్టణాధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు ఆధ్వర్యంలో యువజన విభాగం అధ్యక్షులను మలసాల భరత్‌కుమార్‌ను శాలువాలు, గజమాలలతో ఆదివారం సత్కరించారు. ఈ సందర్భంగా భరత్‌కుమార్ మాట్లాడుతూ మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నియోజకవర్గంలో వివిధ విభాగాల కమిటీలను దశలు వారీగా నియమిస్తున్నారన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన ప్రతి వ్యక్తికి గుర్తింపు ఉంటుందన్నారు. నియోజకవర్గంలో నాయకులతో కలిసి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు జానకీరామరాజు మాట్లాడుతూ పార్టీ పిలుపు మేరకు నియోజకవర్గంలో ప్రజలను చైతన్యవంతులు చేయడం జరిగిందన్నారు. కశింకోట మండల అధ్యక్షుడు మలసాల కిషోర్ మాట్లాడుతూ కొత్తగా పదవులు వచ్చిన వ్యక్తులు మంచిపేరు తెచ్చే విధంగా కృషి చేయాలన్నారు. 80వ వార్డు ఇన్‌చార్జ్ కె.ఎం.నాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో నమ్మకం పోయిందన్నారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడంలో విఫలమవ్వడంతో ప్రజలు వైఎస్సార్‌సీపీ పాలన కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. పార్టీ వైద్య విభాగం రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ లక్ష్మినరసింహం మాట్లాడుతూ కూటమి పాలనపై ప్రజలకు విరక్తి కలిగిందన్నారు. పార్టీ నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు ఎ.వి.రత్నకుమారి, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు వేగి త్రినాథ్, కశింకోట మండల యువజన విభాగం అధ్యక్షుడు నీటపల్లి దివాకర్, కశింకోట మహిళా యువజన విభాగం అధ్యక్షురాలు తరగరంపూడి నూకరత్నంలను భరత్‌కుమార్ శాలువాలతో సత్కరించారు. జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు పెతకంశెట్టి జోసెఫ్, పట్టణ కార్యదర్శి గైపూర్ రాజు, మాజీ కౌన్సిలర్లు నడిశెట్టి మదు, దాడి భోగలింగేశ్వరరావు, సుబ్బారావు, పార్టీ సీనియర్ నాయకులు కాండ్రేగుల హైమావతి, ఉగ్గిన అప్పారావు, ఆడారి శ్రీనివాసరావు, దొడ్డి హరిబాబు, గణేష్, సాయి పాల్గొన్నారు.



మలసాల భరత్‌కుమార్‌ను శాలువాలు, గజమాలతో సత్కరిస్తున్న దృశ్యం

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం



వేల్పులవీధి జంక్షన్ వద్ద మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు పరమేశ్వరావు

అనకాపల్లి టౌన్: వేల్పులవీధి జంక్షన్ వద్ద బీజేపీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరిగింది. పార్టీ జిల్లా అధ్యక్షుడు డి. పరమేశ్వరావు జెండా ఎగురవేశారు. అనంతరం మాట్లాడుతూ నాటి జన సంఘ్ నుంచి నేటి బీజేపీ వరకు పార్టీ ఎదుగుదల గురించి వివరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ కొండబాబు, జిల్లా ఉపాధ్యక్షుడు వుడా రమేష్, జిల్లా కార్యదర్శి ఓరుగంటి నాగమణి, మండల అధ్యక్షుడు వీ నర్సింగ్ యాదవ్, కే సన్యాసిరావు పాల్గొన్నారు. దాసరి గడ్డ రోడ్డు జంక్షన్‌లో జరిగిన వేడుకలలో జీవీఎంసీ 80వ వార్డు డివిజన్ అధ్యక్షుడు మారిశెట్టి భాస్కరరావు మాట్లాడారు. బీజేపీ కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు విస్తరించి ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు కొమనాపల్లి సన్యాసిరావు, కే అప్పలరాజు, రాపేటి సంతోష్, పరదేశి నాయుడు పాలొన్నారు.



దాసరిగెడ్డ రోడ్ జంక్షన్‌లో పార్టీ నాయకులు